కాన్వాస్ చిత్రం

లండన్ మహానగరంలో స్ట్రీట్‌నెంబర్ ఏడు, హౌస్ నెంబరు పదిలో అందంగా అమర్చబడిన అధునాతనమైన అద్దాల బంగ్లా రెండో అంతస్థులో తన గదిలోని కిటికీకి దగ్గరగా కూర్చునుంది తార. అక్కడ కుర్చీవేసుకుని కూర్చుంటే, దూరదూరంగా వున్నా అక్కడా అక్కడా కనిపించే ఇళ్లలోని జనం, ఏవో పనులమీద అటూఇటూ తిరిగే జనం, ప్రతీ ఇంటి ముందూ అందంగా అమర్చుకున్న ముచ్చటైన రకరకాల రంగురంగుల పూల కుండీలూ, చిన్నలానూ, చిలుకపచ్చ రంగు లాన్ మీద తెల్లవారు ఝామున పడే తుషార బిందువుల నిగనిగలూ నీరెండలో మరీ కొత్తగా కనిపించే వింత అందాలను చూస్తూ ఉదయం ఎనిమిది కావస్తున్నా ఎక్కడా అలికిడిలేని ఆ మహాపట్టణంలో, ఎందరికో ఎన్నో వ్యాపకాలుండగా, ఏం చెయ్యాలో తోచని తనని చూస్తే తనకే జాలేసింది తారకి!

కొన్నాళ్లు ఆ చెట్లనీ, పువ్వుల్ని చూస్తూ వాటితో మాట్లాడుతూన్న అనుభూతిని పొందుతూ ఆనందించేది. ఎప్పుడో కాస్త కనిపించే సూర్యకిరణాలని చూసి పరవశించిపోయి, ఎండ వున్నంతసేపూ అక్కడే నుంచుని, ప్రకృతిలో లీనమైపోయేది. భూతలస్వర్గం అంటే ఇదేననీ, సప్తసముద్రాలు దాటొచ్చిన తను ఎంతో అదృష్టవంతురాలిననీ పొంగిపోయింది.

రాను రాను ఆ పువ్వులూ, మంచూ, అందమైన భవంతులూ తీర్చిదిద్దినట్టున్న రహదారులూ అన్నీ బోర్‌కొట్టడం మొదలెట్టాయి. తన ఊళ్లో రోడ్డు పక్కన కాస్త ఖాళీస్థలం వుంటే చాలు - పూచే గడ్డిపూలూ, గుట్టలుగా పెరిగే పిచ్చిచెట్లు ఇక్కడి నుండి ఊహించుకుంటే, ఎంతో ఆనందంగానూ ఆకర్షణీయంగానూ అనిపించసాగాయి. సూర్యుడు రాక మునుపూ ఎంతచైతన్యం! ఇక్కడ అన్నీవున్నా ఏదో కొరత, ఉప్పులేని కూరలా పప్పులేని పెళ్ళిలా కొట్టొచ్చినట్టు కనబడడం మొదలెట్టింది. ఒక వారం రోజులు అంతా కొత్తగా తమాషాగా ఏదో ప్రదర్శనశాలలో అమర్చిన వస్తువుల ప్రదర్శన చూస్తున్నట్టుగా అనిపించింది. మరో వారం అంతా ఏదో సర్దుబాటుగా అనిపించింది. మూడో వారంలో కొచ్చేసరికి ఇమడలేని మూడ్‌లో పడిపోయింది తార. డెబ్భై ఏళ్ల జీవితం సినిమారీలులా కళ్ళముందు కదిలింది. తను కూర్చున్న కిటికీ అద్దం సినిమా తెరలా, తన మెదడు సినిమా రీళ్లలా అనిపించింది. పదిహేను రోజులనుంచీ ప్రతిరోజూ ఎన్నో గంటలసేపు ఆ కిటికీ దగ్గరే మనవడు కిరీటి తోటి ఆడుకుంటూ కూర్చున్నా, ఈ రోజు ఒంటరిగా ఆ కిటికీ దగ్గర కూర్చుని తన అంతరంగాన్ని ఆవిష్కరించుకుంటూ ఉంటే అమితానందం కలిగి, ఆ కిటికీ మీద ప్రత్యేకమైన అభిమానం కలిగింది తారకి!

ఆ రోజుల్లో అది పల్లెటూరనే చెప్పాలి.

అదే అమలాపురం! పక్షుల కిలకిలారావంతో పల్లె లేచేది! పడవ వాళ్లు పడవని నీళ్లలో శుభ్రంగా కడిగి, పడవకి దణ్ణంపెట్టి ఈ గట్టుమీంచి ఆ గట్టుమీదికీ ఆ గట్టుమీంచి ఈ గట్టుమీదికి వెళ్లే జనాలని దింపడానికి డ్యూటీలోకి దిగేవాళ్లు. గంపల నిండుగా అరటికాయలూ, అరటి ఆకులు, అరటిదూట, కొబ్బరికాయలు అమ్మేవాళ్లు బల్లకట్టు లాంచి మీదుగా అంగడికి వెళుతూ వుంటే, ఆ ధృశ్యం ఎంత అందంగా వుండేదో చెప్పలేం. అరటిచెట్లు, కొబ్బరిచెట్లూ అలా వెళుతూన్న వాళ్లని చూసి, మానవజాతికి తామెంత ఉపయోగపడుతున్నామో చూసి తృప్తిగా తలూపుతూన్నట్టు ఆడుతూ కనిపించేవి. జాలరులు వారివారి వలల చిక్కులు విప్పుకుంటూ, కాలవగట్టున కూర్చుని వలలేసేవారు. గిలగిలమంటూ ఆ వలల్లో పడ్డ చేపలు చూడముచ్చటగా అనిపించేవి. జాలరుల మొహం సంబరంతో చాటంతయ్యేది. కన్నెపిల్లలందరూ కళాపిజల్లి, పెద్ద పెద్ద ముగ్గులు పెట్టి, ఆ ముగ్గుల్లో మురిపాలు వెదజల్లుతూ ముచ్చటపడిపోయేవారు. మగపిల్లలు హడావుడిగా బడికి వెళ్లడానికి తయారయ్యేవారు. ఆరోజుల్లో ఆడపిల్లలు పెద్దగా బడికి వెళ్ళడంలేదుగా! ఆడపిల్లల బడివున్నా ఒకరోజు వెళితే నాలుగురోజులు, అమ్మకి వంటసాయంచెయ్యడంకోసమో, తమ్ముళ్లకో చెల్లెళ్లకో ఒంట్లో బాగులేదనో ఇంట్లో వుండిపోయేవారు. తమది మరీ పెద్ద కుటుంబం అవడంవల్ల తనే అందరికంటే పెద్దదవడంవల్ల ఆరుగురు తమ్ముళ్లనీ నలుగురు చెల్లెళ్లనీ చూసుకోవడానికి, ఒకరోజు బడికెళితే నాలుగు రోజులు ఏదో కారణంవల్ల ఇంట్లోనే వుండిపోయేది. కానీ చదువంటే వల్లమాలిన అభిమానం శ్రద్ధా వుండడంవల్ల తమ్ముళ్ళు చదివే పుస్తకాలన్నీ తనూ చదివేది. వాళ్లు హోంవర్కు చేస్తూంటే తనూ దగ్గరుండి చూసి నేర్చుకునేది. తను ఒక్కరోజు బడికెళ్లినా ఆ వారంలో చెప్పినవన్నీ వెంటనే నేర్చుకుని, ఇతర పిల్లలతో సమానంగా మార్కులు తెచ్చుకునేది.

తనకి సంగీతం నేర్చుకోవాలనీ, డాన్సు నేర్చుకోవాలనీ పక్కింటి కమలా, జానకీ వాళ్లలాగా ఎంతో సరదా వుండేది. కానీ అంతమంది పిల్లలతో అమ్మ తనని బడికే సరిగ్గా వెళ్లనిచ్చేదికాదు. అలాంటిది ఇక సంగీతానికెక్కడె వెళుతుంది? అయితే కమల నేర్చుకుంటూన్నప్పుడల్లా తమ్ముళ్లనెత్తుకుని ఆడించడానికి అక్కడికెళ్లేది. కమల పాడుతూంటే విని ఆ పాటలు ఇంటికొచ్చి పాడేది, చెల్లెళ్లని బజ్జోపెడుతూ.

జానకికి భరతనాట్యం నేర్పించేవాళ్లు వాళ్ల అమ్మా నాన్నా. అదేదో మహా అపరాధమయినట్టు మాట్లాడేది అమ్మ. ఎప్పుడైనా ఎవ్వరూ చూడకుండానో లేదా బాతురూంలో స్నానం చెయ్యడానికి వెళ్లినప్పుడు, జానకి వేసే అడుగులూ, ఆ ముద్రలూ తనూ చేసి, చూసి తృప్తిపడేది!

ఎదురింటి అత్తయ్యగారి కోడలు కామాక్షి క్రోషాతో లేసులు అల్లి రకరకాలుగా అమర్చేది. ఊలుతో చక్కగా స్వెట్టర్లు అల్లేది. అవీ నేర్చుకోవాలనీ ఎంతో సరదా పడ్డా, అమ్మ ఒద్దనేది. ఎంతసేపూ అమ్మకి పనిలో సహాయం చెయ్యడం, తమ్ముళ్లకీ చెల్లెళ్లకీ ఏంకావాలో చూసుకోవడం, దీనితోటే సంవత్సరాలు దాటిపోయాయి. అయినా కమల పాడుతూంటే విన్న పాటలతో ఎక్కడికెళ్లినా పాడడం, కామాక్షి అల్లే లేసులూ స్వెట్టర్లూ మెల్లగా కబుర్లు చెబుతూ ఎలా అల్లాలో నేర్చుకోవడంతో తనకి అన్నింటిలోనూ ప్రవేశం కలిగింది. ప్రావీణ్యంలేకపోయినా ఒక్కొక్కసారి తను ఎంతో బాధపడేది. అయితే ఆ బాధని కమ్మని కలలుగా తియ్యని ఆశలుగా మలుచుకోవడం తనకి తెలిసినంతగా ఎవరికీ తెలీదేమో!

అందుకే, తనకి మంచి మొగుడు రావాలనీ, చిన్నకుటుంబంలో తన ఇల్లు చిన్న పొదరిల్లులా వుడాలనే కమ్మని ఊహాలతో కలలు కంటూ ఎన్నో ఆశలు పెంచుకుంది. కోయిలలా పాడుతుంది. తన భర్త తన్మయత్వంతో తన సంగీతం వింటాడు." పాటకి తగ్గట్టు డాన్సుకూడా నేర్చుకుంటే?' ' అడుగుతుంది తను. "అలాగే నీఇష్టం" అంటాడతను. పరవశించి పాడుతూ తను నాట్యంచేస్తూ వుంటే అతడు పారవశ్యంతో పులకించిపోతూ తిలకిస్తాడు. పాడీ ఆడీ అలసిపోయాక, అతని సేవలో, ఇంటిపనులలో నిమగ్నమైపోతుంది. కంటిపాపల్లా ఇద్దరే పిల్లలులంటారు. ఒక ఆడపిల్లా ఒక మగపిల్లాడు. వాళ్లకోసం కామాక్షిలా బోలెడు స్వెటర్లల్లుతుంది. లేసులల్లి గౌన్లకి కుడుతుంది. ఎంత కమ్మటి ఊహ! ఈ ఊహ చిత్రం ఆ వయస్సులో హృదయమనే కాన్వాసుమీద, మనస్సనే కుంచెతో కుదురుగా చిత్రించుకున్న రేఖాచిత్రం! తనకి బాధ కలిగినప్పుడల్లా మనోనేత్రంతో ఈ చిత్రాన్ని చూసి ఉల్లాసంతో కాలం గడిపేసే పదహారేళ్ల వయస్సది!

అయితే, తన పిన్నికూతురు కళావతి పెళ్లిలో ఇంచుమించు తన పెళ్లి కుదిరిపోయింది. తనని చూడగానే తన బాబాయి ఫ్రెండు చలపతిగారు కానీ కట్నం లేకుండా తనని కొడల్ని చేసుకుంటానన్నారు. కారణం సహజంగా కన్నా తను కాస్త అందగత్తె కావడం, అన్ని విద్యల్లోనూ కాస్తో కూస్తో ప్రవేశం వుండడం. అన్నింటికన్నా ముఖ్యంగా తను తన తమ్ముళ్లనీ చెల్లెళ్లనీ పెంచడంలో తల్లికి తోడ్పడ్డ విధానం! చలపతిగారి భార్యకి గుండెజబ్బు. ఎప్పుడూ ఒచ్చే ప్రాణం, పోయే ప్రాణం. ఆమెకి ముగ్గురు కొడుకులూ, ముగ్గురు కూతుళ్ళూ! పెద్దవాడు అరవింద్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నవాడు గోవింద్ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. మూడోవాడు ఆనంద్ కాలేజీ చదువులో వున్నాడు. పెద్దమ్మాయి శివానీకి పెళ్ళయింది. భవానీకి పెళ్ళి కుదిరింది. కాత్యాయిని స్కూల్లో చదువుకుంటోంది.

కట్నంలేని పెళ్లి! కోరి వచ్చిన సంబంధం, సరేనన్నారు తల్లి దండ్రులు. అలా పెద్ద కుటుంబంలోనే, పెద్ద బాధ్యతతోటే కాపురానికొచ్చింది. అరవింద్‌కి ఆఫీసు పని తప్ప ఇంటి

గొడవలు పట్టవు. తగిన సమయమూ లేదు. ఎవరికేం కావాలన్నా అందరి నోళ్లలోనూ పలికేది ఒకే ఒక్క పేరు తార! తార హృదయం మీద గీయబడిన కమ్మని ఊహా చిత్రం ఇంకా అలాగే ఉండిపోయింది. అరవింద్‌కి పాటలంటే ఇష్టమే. రేడియో వింటాడు. క్యాసెట్లు వింటాడు. తనెప్పుడయినా పాడి 'బాగుందా?' అని అడిగితే బాగుందంటాడు. లేకపోతే లేదు. ఇక మిగిలిన వాటికి తీరికేది? అప్పుడు అమ్మ ఇల్లు. తమ్ముళ్లూ చెల్లెళ్లూ! ఇప్పుడు అత్త ఇల్లు. మొగుడూ, అత్తమామలు, మరుదులూ, ఆడపడుచులూ, వచ్చేవాళ్లూ వెళ్లేవాళ్లూ. అంతా ఒక్కటే! కాకపోతే ఇళ్లే వేరు వేరు.

కాకపోతే తను నిరాశపడలేదు. తనకి తీరని కోరికలు తన పిల్లలకి నేర్పించి తృప్తిపడాలనుకుంది. చూస్తూండగానే పెళ్లయి ఆరు వసంతాలు దాటడం, తను పాండవులలాంటి అయిదుగురు మగపిల్లలకి తల్లి కావడం, అంతా జరిగిపోయింది. రెండు కళ్ళలాంటి చిన్నారులిద్దరు, అనుకున్నది. ప్రతిసారీ మగపిల్లాడే పుట్టడంతో ఇంటికి ఒక లక్ష్మి లేకపోతే ఎలా? అన్న అత్తగారి మాటలకీ, అరవింద్ చేష్టలకీ, పంచపుత్రులకు తల్లయింది తను. అయినా తనలోని కోరికలూ పెంచుకున్న ఆశలూ పూర్తిగా చావలేదు. పెద్దవాడు ధర్మేంద్రకి సంగీతం నేర్పించింది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ దగ్గర, అర్జున్ - రెండవవాడికి వెంపటి సత్యంగారి దగ్గర కూచిపూడి నాట్యం నేర్పించింది. నరేన్ - మూడోవాడికి అల్లికలూ కుట్లూ నేర్పించింది. నాలగోవాడు భరత్‌కి చిత్రకళ నేర్పించింది. అయిదోవాడు నితిన్‌కి కరాటే యోగా నేర్పించింది.

ఆయా విద్యల్లో వాళ్లు ప్రావీణ్యం సంపాదించి అనేక పోటీలలో నెగ్గినప్పుడల్లా, వాళ్లలో తనని చూసుకుని మురిసిపోయేది. క్రమేణా హృదయంమీద గీసుకున్న కాన్వాస్ చిత్రం మసకబడి మాసిపోయింది. ఆ స్థానంలో సంగీత విద్వాన్ ధర్మేంద్ర, నాట్య శిఖామణి అర్జున్, హస్తకళల నిపుణుడు నరేన్, సుప్రసిద్ధ చిత్రకళాకారుడు భరత్, కరాటే బ్లాక్‌బెల్ట్ మాస్టర్ నితిన్‌లు చోటుచేసుకున్నారు.

అంతటితో ఊరుకోలేదు తను! వాళ్లకి తగ్గ కోడళ్లని కూడా ఎంచిపెట్టి, ఒకరికి మరొకరు తోడై, వారివారి ఖ్యాతిని రెండంతలు చేసుకునేలా చేసింది.

ఈ ప్రయత్నాలలో అద్దంలో కనబడ్డ తెల్లవెంట్రుకలు చూసుకునే దాకా తనకి అయిదు పదులు దాటిపోయాయని కూడా తెలుసుకోలేదు. అరవింద్ తన ప్రయత్నాలు దేనికీ అడ్డుచెప్పకపోవడం, తన పట్టుదలా కలిసి తన కోరికలను ఇంచుమించు తీర్చాయి.

అయితే రెక్కలొచ్చిన పిట్టలు గూటిలో ఆగుతాయా? అమ్మతెచ్చే ఆహారం కోసంకాక, తమ గింజలను తామే వెతుక్కుంటూ ఎంత సుదీర్ఘ ప్రయాణాలనైనా చేస్తాయి. అమెరికాలో

ధర్మేంద్ర, ఆస్ట్రేలియాలో అర్జున్, లండన్‌లో నరేన్. సింగపూర్‌లో భరత్, ఆఫ్రికాలో నితిన్ వాళ్ళవాళ్ల భార్యల అభిరుచులనుబట్టి, వారి వారి కోర్కెలను బట్టి, వారి వారి పిల్లల భవిష్యత్తును బట్టి, గువ్వల్లా ఎగిరిపోయారు. రెక్కలు ముక్కలు చేసుకుని చేస్తున్న ఉద్యోగం రెండున్నర దశాబ్దాల తరవాత ఇంక తగవని ప్రభుత్వం వాళ్లు రిటైర్‌మెంట్ ఇచ్చాక ఇంట్లో కూర్చున్నాడు అరవింద్. అప్పుడనుకుంది తను పోనీ ఇప్పుడు తను సంగీతం నేర్చుకుంటే సంగీతం కచ్చేరీల కోసమే కాదు కదా! ఆత్మానందం కోసం ! అలాగే ఏ కళ అయినా! ముందు ఏ కళయినా కళాకారునిలో స్పందననీ, సంతృప్తినీ కలగజెయ్యాలి. ఆ తరవాతే అంది ఇతరులకి ఆనందాన్నిస్తుంది. అంతేకానీ ఎవరికోసమో, ఏదో చేస్తున్నామనుకునే వాళ్లూ, లేదా తద్వారా ధనార్జన చెయ్యడానికి అదొక వృత్తిగా మాత్రమే స్వీకరించేవాళ్లూ, సిసలైన కళాకారులు కారని తన ఉద్దేశం. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గని' దేవులపల్లి కృష్ణశాస్త్రి కవితలో లాగా 'ఎవరేమనుకుంటేనేమి? నా కోరిక తీర్చుకుంటాను' అని తననుకునే లోపలే, ధర్మేంద్రా వాళ్లూ ఇండియాకి రావడం, పిల్లల్ని వదిలిపెట్టి వాళ్లు ఇండియా పర్యటనల కెళ్లడం, అర్జున్ భార్య కాన్పుకోసం ఇండియాకి రావడం, తల్లి అస్వస్థత వలన తనే పురుడు పొయ్యడం, ఇలా ఏదో ఒకటి అడ్డుతగులుతూనే వచ్చింది. చిన్నప్పటి ధైర్యం ఇప్పుడు లేదు. ఎప్పుడో ఒకప్పుడు అనుకున్నవి సాధించలేకపోతానా అన్న తియ్యని ఆశలూ కమ్మని కోర్కెలూ ఇప్పుడు లేవు! పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్న తమ్ముళ్లూ, చెల్లెళ్లూ తనకన్నా వాళ్లేదో ప్రతాపవంతులయ్యారని తనని చిన్నచూపుచేసినప్పుడు తనేమిటో తనకు తానుగా గీసుకున్న కాన్వాస్ చిత్రం ఏకలవ్యునికి విద్యచేర్పినట్టు, తనలో ఎలా ఆశలుపోసి బతికించి, ఇంతదానిని చేసిందో చెప్పాలని అనిపించినా, వినే ఓపిక వాళ్లలో లేనప్పుడు, అది కూడా వృథా ప్రయత్నమేననిపించింది.

ఇప్పుడు తన మనోభావాలూ, తన ఆదర్శాలూ, తన అనుభవాలూ ఎవ్వరికీ అక్కర్లేదు. తను కన్న పిల్లలకి కూడా! ఎంత శ్రద్ధతో ఎంత శ్రమకోర్చి తమని ఆయా విద్యల్లో ఆమె వాళ్లని ప్రవీణులని చేసిందో కూడా వాళ్లకక్కరలేదు. ప్రతి చిన్న పనికీ అత్తింట్లో అందరూ తన మీద ఆధారపడ్డ వాళ్లకి ఈనాడు తన అవసరంలేదు.

అందరికీ కావలసింది ఒక్కటే! ఆమె ఇంకా అందరికీ చాకిరీ చేసి పెట్టాలి! అత్తింటికీ, పుట్టింటికీ నడుమ తన ఇల్లు వెలయడంతో, ఆరెండిళ్లూ ఆహక్కును పోగొటుకున్నా, తనింట్లో వాళ్లకి మాత్రం ఆ హక్కుమిగిలింది. అయితే అది అయిదు ముక్కలవ్వాలి. ఒక్కొక్కరికి ఒక్కొక్క ముక్కే మిగులుతుంది. అంటే సంవత్సరంలో రెండు నెలల పదిరోజులు మాత్రమే! మిగిలిన తొమ్మిది నెలల ఇరవైరోజులూ తను వాళ్లకి ఏరకంగానూ ఉపయోగపడడం లేదని ఎవరికి వారికే కోపం, బాధా! దాంతో ఎవరికి వారిచే నిష్ఠూరాలడడం!

రిటైరయ్యాక కనీసం ఇంటి కాపలాకైనా పనికొస్తుందని అరవింద్‌ని కూడా కొందరు పిలవడం, దాంతో అరవింద్ అమెరికాకి వెళితే, తను మరో కొడుకు దగ్గరికి ఆస్ట్రేలియాకి, అరవింద్ ఆఫ్రికా వెళితే తను సింగపూర్‌కి, ఇలా నెలా ఒక దగ్గరికి పంచుకోవడం జరుగుతోంది.

చూస్తూ, చేస్తూ డెబ్భయ్యోపడిలో పడింది తను. ఎనభయ్యో వడిలో పడ్డాడు అరవింద్! కాలంలో కూడా అనేకమార్పులు. మనవలకీ మనవరాళ్లకీ కూర్చుని కథలు చెప్పే అవసరంలేదు. వాళ్లు రోజు చూసే టి.వీ.ల ద్వారా, అధునాతనమైన ప్రపంచం నవీన నాగరికతవల్లా, ఎన్నో విషయాలు వాళ్లకి తెలిసినవి తనకి తెలీవు. తను చెప్పే రాముడూ, రావణాసురుడి కథలు వాళ్లకి నచ్చవు. గవ్వలాట, చింతపిక్కలాటా ఎవ్వరూ ఆడరు. అన్నీ కంప్యూటర్ గేమ్స్! ఎంత తేడా!

సడన్‌గా ఒంటరితనం!!సహజంగా వయస్సుతో కలిగే భయం! తనకి అందరూ కావాలనిపిస్తుంది. అది సాధ్యం కాని పని. తను అందరికీ కావాలి! అదీ సాధ్యంకాని పనే! ఆలోచిస్తే మళ్లా అదే అసంతృప్తి! అదే ఆందోళన! అవే తీరనికోరికలు. అయితే చిన్నతనంలో వాటిని ఆశలతో నింపవచ్చు! అబద్ధాలలో దాచుకోవచ్చు! అందరుచూడవచ్చు. కానీ, ఇప్పుడో?.. మనసు ఒప్పుకోదు! గడచిన సంవత్సరాల్లోని వాస్తవం ఊహలను నమ్మదు! అందుకే నిర్లిప్తత! లేదా వైరాగ్యం!"

ఉన్నట్టుండి మంచు కమ్ముకొచ్చింది. 'లండన్‌లో ఇదే గొడవ. పడితే టపటప వాన! వెంటనే వాన వెలిసి పోయి ఎండలాంటి వెలుగూ ఆ తరవాత ముసుగులాంటి మంచుతెర. ఇంగ్లీషు వాళ్లు 'ఫాగ్' అంటారు. తన ఆలోచనలకీ ముసుగుపడింది. కిటికీలోంచి చెట్లూ, చేమలూ ఏమీ కనబడడంలేదు. పచ్చని లాన్ కూడా మంచుతో కప్పబడిపోయింది. కిటికిలోంచి చల్లని గాలి తన్నుకొచ్చింది.

ఆలోచనలను నెట్టేసి, వాస్తవంలో కొచ్చిన తార, తన నేస్తమయిన కిటికీకి చెప్పి తలుపులు మూసేసింది! హృదయంలోని కాన్వాస్‌కి కూడా మంచుముసుగు పడిందేమో, ఏబొమ్మాకనబడడంలేదు తారకి!

'తార'! తనపేరు తనకే తమ్మాషాగా తోచింది. తార అంటే నక్షత్రం కదా! నక్షత్రాల మిణుకుమిణుకు తళుకులు ఇతరులకి ఆనందాన్నిస్తాయి. కానీ, వాటికేం తెలుసు వాటి మెరుపూ, అందం? అలాగే తన ఆశలూ, కోరికలూ, తన పిల్లలు పంచుకున్నారు. పెంచుకున్నారు! ప్రఖ్యాతి గడించారు! కానీ తనుమాత్రం అలాగే తారలా వుండిపోయింది. ఆ సంగతి ఎవరికి తెలుసు తనకి తప్ప! ఒకవేళ తన తల్లితండ్రులు ముందే ఊహించారేమో!

* * *